# రాలిన శేఫాలిక

ఒరియా: సురేంద్రనాథ శతపథి   తెలుగు: వి. లక్ష్మి



వసంతంలో ఒక సరసమైన సాయంకాలము.

ఆరావళీకొండల అడవిలో మాధవికా ఉపవనం సౌరభముతో మత్తెక్కిస్తున్నది. కొండ గుండెలు చీల్చుకుని ప్రవహిస్తున్న కొండవాగులో సూర్యకిరణములు రంగు రంగుల కమనీయవిలాసము సృష్టిస్తున్నాయి. వాగు ఒడ్డున రాతిఫలకంమీద ఒక యువకుడు కూచుని ఉన్నాడు. వయస్సు పద్దెనిమిది సంవత్సరములు. వేషములో అంత పరిపాటి లేకపోయినా శరీరంలోరాజతేజస్సు స్పష్టంగా కనిపిస్తున్నది. కనుకొలకుల్లో తేజస్సుంది. తెల్లటి ప్రశాంతమైన శరీరం. మోకాళ్ళకి మోస్తున్నవి బాహువులు. విశాలమైన వక్షస్థలం. తరుణుల హృదయాల్లో కంపన కలిగించగల కమనీయమైన మూర్తి.

చేరువనే ఉన్నది భిల్లపల్లె. దానివేపే ఉంది అతడి దృష్టి. పల్లెపక్కనే ఒక భగ్నమైన పర్ణకుటీరం. దానిలోనుంచి సుళ్ళుతిరిగి లేస్తున్నది పొగ. అక్కడే విశ్రమిస్తున్నారు తన తల్లిదండ్రులూ, చిన్నతమ్ముడూను. మీవార్ కేసరి విశ్రామకుటీరం అది. ఈ కీకారణ్యంలోంచి, ఈ నిశ్శబ్దప్రదేశంనుంచి ఢిల్లీశ్వరుడైన అక్బరు చక్రవర్తిని వెక్కిరిస్తూవుంది రాజపుత్ర శతదళపద్మం! యవన రాజ్ఞికి వైధవ్యవేదన కలిగించి, తిరిగి ప్రాణాధికమైన చిత్తూరు దుర్గలక్ష్మిని శత్రువులనుంచి విడిపించడంకోసము బలం పుంజుకుంటున్నాడు వీరపుంగవుడు రాణాప్రతాపసింహుడు. రాజపుత్రజాతికి చిట్టచివరి ఆశాజ్యోతి అతడు. అతడే మన యువకుడి తండ్రి.

యువకుడు అమరసింహుడు, తండ్రిని తలచుకుంటూ భక్తితో తలవొంచాడు. తన తండ్రికోరిక సఫలంకావాలని భగవంతుణ్ణి ప్రార్థించాడు.

చిత్తూరు దుర్గంమీద యవనుల విజయ పతాకం ఎగరడమంటే గుండెల్లో ఎంతబాధ! లక్ష్మణుడి గుండెల్లో ఇంద్రజిత్తు శక్తి నాటుకున్నట్టుంది. చిత్తూరు శత్రువుల చేతిలో వుండడం రాణాప్రతాపసింహుడికి సహించరాని బాధ. చిత్తూరు ఆకాశం గాలిలో విలాప తరంగాలు కంపిస్తున్నవి. ప్రతి కదలిక, ప్రతి రాతిరేణువు, ప్రతి పిట్ట అరుపు స్వాతంత్ర్యముకోసము బాధపడుతున్నది; ప్రతాపసింహుణ్ణి అర్థిస్తున్నట్టున్నాయవి. చిత్తూరు ముక్తికోసమే అరణ్యవాసం ఆనందంతో వరిస్తున్నాడతడు. తన చిన్నిబిడ్డ చేతిలోని అడవి దుంపముక్క అడవిపిల్లి లాక్కుపోతే అతడి మనస్సు బాధపడలేదు. గుండె రాయిచేసుకున్నాడతడు. జన్మభూమి విముక్తికోసం కొత్తదారి వెదుకుతున్నాడు. భిల్లసర్దారు సహాయంతోనూ, కొద్దిమంది రాజపుత్రులతోనూ తయారయింది అతడి సైన్యవాహిని. కొత్త ప్రతాపంతో కొత్త ఉత్సాహంతో పులకిస్తున్నాడతడు. దండయాత్ర ప్రయత్నాలన్నీ సిద్ధమయాయి. రేపు ఉదయాన్నే ప్రయాణం. కుమారుడు అమరసింహుడున్నూ వొక దళానికి ఆధిపత్యం వహించాలి.

అమరసింహుడు ఆలోచిస్తున్నాడు. చప్పున సంభవించే విజయచింతతో ఉల్లాసంగా వున్నాడతడు. అతడి నరనరాలా వీర రక్తం ఉప్పొంగుతోంది. బిగించిన పిడికిలి కంపిస్తోంది. మెరిసే కళ్ళతో మొహం వికసిస్తోంది. కానైతే ఉత్తరక్షణంలో ఏదో ఆలోచన వచ్చి మబ్బు కప్పిన చందమామలా మారిపోతూ వుంది మొహం.

హఠాత్తుగా మాధవిక పౌదమాటున హంసలు వస్తున్న ధ్వని విని తుళ్ళిపడ్డాడు అమరుడు. అడవిలో హంసలా? ఉహూఁ, ఇది హంసల ధ్వనికాదు. హంసల ధ్వనిని గేలి చేస్తున్న భిల్లసరారు కూతురి పాదాల నూపురధ్వని. ఈమె పేరు రూప. పురూరవుడి దగ్గిరికి వస్తున్న ఊర్వశి.

అమరుడు అవేపే చూస్తున్నాడు. అవును, ఆ వస్తున్నది రూప. ఈ అడవంతటికి లీలాపద్మం రూప. ఈ వనవాసంలో అమరుడి సహచరి, ప్రియబాంధవి రూప. ఏ మహత్తరమైన ఆకర్షణమో, రెండుపువ్వులూ ఒక్కటి కావడంకోసం ఆరాటపడుతున్నాయి. విజయాభిలాషతో రూపని విడిచి వెళ్ళడమంటే జాలిగా కొట్టుమిట్టాడి పోతూవుంది అమరసింహుడి హృదయం. గడచిన దినాలు తలపోస్తున్నాడతడు:

అవాళ ఆ తొలినాటి పరిచయం. నీటి కడవ పట్టుకుని గృహాభిముఖంగా వెళుతోంది భిల్లసర్దారు కూతురు రూప. నిజంగా ఆమె పాదాలు పడినచోటల్లా ఎర్రతామరలు వికసించినట్టున్నాయి. ఆమె రూప మదిర పానంచేస్తూ, చెట్లమాటునుంచి మట్టిబెడ్డ గురిపెట్టి విసిరాడు అమరసింహుడు ఆమె తలమీది కడవమీదికి. ఫలితంగా కడవ పగిలింది. నీళ్ళు వొలికి రూప చేలాంచలం తడిపేశాయి. అసలే అందమైన ఆమె అవయవాలు మరింత అందంగా అగుపించాయి. పారుతున్న సెలయేరు చప్పున ఆగిపోయినట్టు ఆగిపోయింది రూప. ఎవరిదీ చాపల్యం అన్నట్టు కోపంతో నలువేపులా చూసింది. తుప్పల చాటున అమరసింహుణ్ణి చూసింది. చిన్న దీశఖమీద పుడిసెడు నీళ్ళు పోసినట్టు ఆమెకోపం ఆరిపోయింది. అతణ్ణి పోల్చుకుం

ద్దామె. ప్రణయాపాంగ మెరగని ఆ అడవి పిల్ల మల్లెపువ్వుల నవ్వు నవ్వింది. తలలో ముడుచుకున్న కొండమల్లె పువ్వుల గుత్తి తీసి, ప్రేమకానుకలాగ అమరుడి మీదికి విసిరి చువ్వలాగ పారిపోయింది. ఆ అడవి మల్లెగుత్తి నేలమీంచి తీసి పదేపదే వాసన చూశాడు అమరసింహుడు. ఏ దేవకన్య తలవాసనో ఆ కొండపువ్వులలో గుబాళించినట్లనిపించి దతడికి. స్నేహంతో, ఆదరంతో గుండెల కద్దుకున్నా డతడు.

అవాళటి ఆ నాలుగు కళ్ళ కలయిక, తొలిపరిచయం వారిద్దరి హృదయాల్లో మెల్లి మెల్లిగా సృష్టించింది గభీరమైన ప్రణయం; అభినవస్పర్శా కంపనం. వారిద్దరి మనస్సుల ఉపవనాల్లో శతదళపద్మాలు వికసించాయి. అడవిలో ఆ తుప్పలమాటున ఎన్నిమార్లో ప్రతిధ్వనించింది అభిసారిక అడుగులసవ్వడి. ఎన్నోమార్లు ఆ అడివిలో చీకటిని చీల్చుకుని వెలువడింది ప్రియురాలి నవ్వుల వెన్నెల. రూప శిగలో మల్లెగుత్తులు ముడవడానికి ఎన్నిమార్లో త్వరపడ్డాయి అమరసింహుడి మునివేళ్ళు. ఆ కొండవాగు గాలిలో ఎన్నోసార్లు రూపమాట వినిపించింది అమరసింహుణ్ణి ఆమె 'రాజా!'అని సంబోధించడం.

ఒకనాటిమాట అమరుడికి తలపుకి వస్తోందివాళ. అవాళ పూలతో వొరిగిపోతూన్న అశోక వృక్షాన్ని ఆనుకుని నుంచుంది రూప. రెండు పద్మ పుష్పాలు ఆమె రెండు చెవులకీ అలంకరిస్తున్నాడు అమరుడు. గాలి కెగిరి ఆమె జుత్తు అతడి గుండెలమీద పడుతూ గిలిగింతలు పెడుతోంది. ఉన్నట్లుండి అతడి పాదంమీద వేడి కన్నీటిచుక్క పడింది. తుళ్ళిపడ్డా డతడు. చూచాడు. తలవొంచుకుని ఏడుస్తూవుంది రూప.

తన చేతులతో ఆమె మొహం పైకెత్తి స్నేహార్ద్ర కంఠంతో అడిగాడు అమరుడు:

"రూపా! నువ్వు ఏడుస్తున్నావా?"

"రాజా......!"

రూప పెదవు లదురుతున్నాయి. మనస్సులోని మాట సగం ఆగిపోయింది. పున్నమినాటి సముద్రంలాగ ఆమె నేత్రాలనుంచి కన్నీరు మరింత వుప్పొంగింది.

"ఏమిటి రూపా? చెప్పు. మాటాడు..."

తన వేళ్ళతో ఆమె కన్నీళ్ళు తుడిచి వోదారుస్తూ అడిగాడు అమరసింహుడు.

"రాజా!"

"చెప్పు, చెప్పు రూపా!"

"నువ్వు రాజువైతే నిజంగా నన్ను రాణీగా తీసుకు వెళతావా?"

పాపం అడవిపిల్ల జాలిగా, సందేహంగా చూస్తూ అడిగింది. ఆ విచారంవల్లే ఆమె హృదయం అట్టడుగునించి ఉబికి కన్నీరు ప్రవహిస్తున్నట్లుంది.

ఆమె ప్రశ్నకి ప్రత్యుత్తరంగా శంఖం వంటి ఆమె మెడచుట్టూ పెనవేసుకున్నాయి అమరుడి బాహువులు. పదేపదే ఆమె శిరస్సు ముద్దాడాయి అతడి పెదవులు. దీంతో ఏం సాంత్వనం కలిగిందో రూపకి, మెల్లి మెల్లిగా ఆమె మొహం వికసించి, కలకల్లాడింది.

అదిగో ఆ రూప వస్తోందిపుడు. భిల్ల సమాజపు కఠోరమైన దండవిధానం లెక్కచెయ్యకుండా వస్తోంది తన ప్రియతమరూప. భిల్లసర్దారు వాడి ఈటెమొన లక్ష్యంలేని అభిసారిక ఆమె. ఆమె అడుగుల సవ్వడిలో అశాంతి ధ్వనిస్తోంది. ఆమె తల చిందరవందరగావుంది. రేపు ప్రాతఃకాలమే అమరసింహుడు ఆ అడవి వొదిలి వెళతాడని ఆమెకు తెలిసేవుండాలి, సందేహంలేదు. అందుకనే ఆమె నడకలో ఈ అశాంతి. అందుకనే వరద వచ్చిన కొండ వాగులా వుంది ఆమె వేషం. అమరుడు పలకరించక ముందే ఆమె అతడి గుండెలమీద వాలిపోయింది వచ్చి. ఎగసిపడుతున్న గుండెలతో ఏడుస్తోందామె.

"రూపా!" వోదారుస్తూ అన్నాడు అమరుడు. "ఏడవకు. వేగం వచ్చేస్తాను. ఈ మారు మేం తప్పక గెలుస్తాం." తన తల నిమురుతూ అమరుడు చెప్పిన ఈ వోదార్పు మాటతో రూప హృదయంలోని పెనుగాలి ఆగలేదు సరికదా, మరింత మరింత రెచ్చిపోయింది.

"చిత్తూరు దుర్గంనించి శత్రువుని తరిమికొడితేకదా నిన్ను రాణీగా చేస్తాను. అందుకని విచారించకు" అంటూ మళ్ళీ వోదారుస్తూ అన్నాడు అమరసింహుడు.

"వద్దు, వద్దురాజా! నువ్వు వెళ్ళకు. నేను రాణీని కాలేననే అనిపిస్తోంది నాకు." రూప జాలిగా అంటున్న మాటలు అడవి వాతావరణాన్ని కూడా జాలిలో ముంచెత్తాయి.

కొండవాగు వొడ్డున చెట్లు సమవేదనతో గాలికి కదిలి ఆకులనించి కన్నీళ్ళు రాల్చాయి. పైమీది వోణీచెంగున ప్రియురాలి కన్నీళ్ళు తుడిచి వోదార్చాడు అమరసింహుడు.

ఆకుల మర్మరధ్వనిలో హఠాత్తుగా ఎవరిదో అడుగుల చప్పుడు విని ప్రేమికు లిద్దరూ తుళ్ళిపడ్డారు. చెట్లసందునించి ఎవ్వరివో పెద్దపులి కళ్ళు చూసి భయంతో అరిచింది రూప.

"రాజా!-నాన్న-సర్దార్..."

"ఆఁ! సర్దారా!" అమరసింహుడు కూడా భయంతో కంపించాడు.

ఇప్పుడేం చేయడం? ఏమీ తోచలేదు. భిల్లుల సమాజంలో ఇలాటి రహస్య అభిసారంవల్ల ఎలాంటి ఘోరమైన పరిణామం కలుగుతుందో తలుచుకుని అతడు వొణికిపోయాడు. రూపని పక్క రాతిబండమాటున దాచడానికి ప్రయత్నించేలోపున భిల్లసర్దారుడి దయమాలిన వాడి బల్లెంమొన ఆమె కోమల హృదయంలో దుసెళ్ళిపోయింది. ఆమె కింద పడిపోయి అరిచింది:

"రాజా...!"

"రూపా! ఏమైంది?" అంటూ ఆమెని ఎత్తి పట్టుకుని ఏడవడం మొదలెట్టాడు అమరసింహుడు. రాణాప్రతాపసింహుడి కుమారు డతను. అతడి రాజపుత్ర శౌర్యం ఎటు మాయమయిందో అప్పుడు! శిశువులా జాలిగా వుంది అతడి కంఠస్వరం.

"రాజా!...నన్ను 'రాణీ!' అని పిలవవూ!" వేదనాకంఠంతో అర్థించింది రూప.

"రాణీ! రాణీ! నా హృదయరాణీ!" రక్తంతో తడిసిపోతూన్న రూప శరీరంమీద వాలిపోయాడు అమరుడు.

"రా...జా!" ప్రియతముణ్ణి క్షీణస్వరంతో తుదిసారి పిలిచింది రూప. అతణ్ణి కౌగిలించుకోవాలన్న ఆమె తుదియత్నం వ్యర్థమైంది. చాచబోయి చాచలేకపోయింది చేతులు.

అంతా అయిపోయింది. ఉసురులేని రూప శరీరం గట్టిగాపట్టుకుని ఏడ్చాడు అమరసింహుడు. అడవిచెట్లు ఏడ్చాయి. పొదరిళ్ళలో జలజలరాలి ధూళిలో పొర్లాడాయి శేఫాలిక పుష్పాలు.